# నమస్తే తెలంగాణ
## మంచిర్యాల
## కుమ్రం భీం ఆసిఫాబాద్
5 | గురువారం 26 సెప్టెంబర్ 2024 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD


## ట్రాన్స్‌జెండర్ల సంక్షేమంపై దృష్టి

**మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్**

నస్పూర్, సెప్టెంబరు 25 : ప్రభుత్వం ట్రాన్స్‌జెండర్ల సంక్షేమంపై ప్రత్యేక దృష్టి సారించిందని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం స్థానిక కలెక్టరేట్‌లో ముగ్గురు ట్రాన్స్‌జెండర్లకు ధ్రువీకరణ పత్రాలు అందించారు. ఈ పత్రాల ద్వారా ఉపకార వేతనాలు, స్కిల్ డెవలప్‌మెంట్, కాంపోజిట్ మెడికల్ హెల్త్, స్మైల్ వంటి పథకాల కింద సాయం అందుతుందని ఆయన తెలిపారు. ఇన్‌చార్జి జిల్లా సంక్షేమాధికారి స్వరూపరాణి పాల్గొన్నారు.



ట్రాన్స్‌జెండర్లకు గుర్తింపు పత్రాలు అందిస్తున్న కలెక్టర్

## పల్లెలను పరిశుభ్రంగా ఉంచాలి

**- డీఎల్‌పీవో ధర్మారాణి**

కోటపల్లి, సెప్టెంబర్ 25 : పల్లెలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మంచిర్యాల డీఎల్‌పీవో ధర్మారాణి సూచించారు. స్వచ్ఛతాహీసేవా కార్యక్రమంలో భాగంగా బుధవారం కోటపల్లి, షట్‌పల్లి గ్రామ పంచాయతీల్లో పర్యటించారు. పారిశుధ్య కార్యక్రమాలను పరిశీలించారు. జ్వరాలు పెరుగుతున్నందున దోమల నియంత్రణపై దృష్టి పెట్టాలని, ప్రతిరోజూ ఫాగింగ్ చేయాలని సూచించారు. మురుగు కాల్వలను శుభ్రం చేయించడంతో పాటు నీటి లీకేజీలను అరికట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో ముల్కల్ల సత్యనారాయణ రెడ్డి, పంచాయితీ కార్యదర్శి సత్యనారాయణ పాల్గొన్నారు.



పారిశుధ్య కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న డీఎల్‌పీవో ధర్మారాణి




గోలేటి ఏరియా జీఎం శ్రీనివాస్‌కు వినతిపత్రం అందిస్తున్న టీబీజీకేఎస్ నాయకులు

# జీఎం ఆఫీస్‌ల వద్ద టీబీజీకేఎస్ ధర్నా

- 33 శాతం లాభాల వాటా చెల్లించాలని డిమాండ్
- కాంగ్రెస్ సర్కారుకు వ్యతిరేకంగా నినాదాలు
- కార్మికులకు న్యాయం చేయాలంటూ అధికారులకు వినతులు

సీసీసీ నస్పూర్, సెప్టెంబర్ 25 : సింగరేణి సంస్థ సాధించిన లాభాల్లో కార్మికులకు 33 శాతం వాటా చెల్లించాలని డిమాండ్ చేస్తూ టీబీజీకేఎస్ నాయకులు, కార్మికులు బుధవారం ఆందోళనలు చేపట్టారు. శ్రీరాంపూర్‌లోని జీఎం కార్యాలయం వద్ద టీబీజీకేఎస్ శ్రీరాంపూర్ ఏరియా ఉపాధ్యక్షుడు పెట్టం లక్ష్మణ్ ఆధ్వర్యంలో నాయకులు, కార్మికులు ధర్నా చేశారు. కాంగ్రెస్ సర్కారుకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం ఎస్‌వోటూజీఎంకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పెట్టం లక్ష్మణ్ మాట్లాడుతూ 2023-24 ఆర్థిక సంవత్సరంలో సింగరేణికి రూ.4701 కోట్ల లాభాలు వచ్చినట్లు యాజమాన్యం ప్రకటించిందని, వాస్తవ లాభాల నుంచి సుమారు రూ. 1551 కోట్లు కార్మికులకు ఇవ్వాల్సి ఉండగా, కేవలం రూ.796 కోట్లు చెల్లించేందుకు సిద్ధమైందన్నారు. 33 శాతం లాభాల వాటాను ప్రకటించి, కేవలం 16 శాతమే చెల్లించాలనుకోవడం దారుణమన్నారు. కార్మికులకు న్యాయం జరిగే వరకూ యూనియన్ ఆధ్వర్యంలో దశల వారీగా నిరసనలు చేపడుతామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు పానుగంటి సత్తయ్య, పొగాకు రమేశ్, సాదుల భాస్కర్, గొర్ల సంతోష్, కురుమ వికాస్, బిరుదు శ్రీనివాస్, బోడగుంట తిరుపతి, రాజేశం, సల్మాన్, సదానందం, వెంకన్న, పాదం శ్రీనివాస్, మారం శ్రీనివాస్, మేడం తిరుపతి, చిప్ప రమేశ్, తుర్రం శ్రీకాంత్, కార్తీక్, మల్లికార్జున్ పాల్గొన్నారు.

మందమర్రి, సెప్టెంబర్ 25 : మందమర్రి జనరల్ మేనేజర్ కార్యాలయం ఎదుట టీబీజీకేఎస్ నాయకులు, కార్మికులు ధర్నా నిర్వహించారు. నాయకులు మాట్లాడుతూ కార్మికుల కష్టార్జితం వారికి దక్కే వరకూ టీబీజీకేఎస్ పోరాడుతుందన్నారు. తమ యూనియన్ ఆధ్వర్యంలో చేపడుతున్న ఆందోళనలు, నిరసన కార్యక్రమాలకు మద్దతు ఇవ్వాలని పిలుపునిచ్చారు. అనంతరం ఏరియా ఎస్‌వోటు జీఎం రాజేశ్వర్ రెడ్డికి వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో టీబీజీకేఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు మేడిపల్లి సంపత్, కేంద్ర ఉపాధ్యక్షులు బడికెల సంపత్ కుమార్, జే.రవీందర్, కేంద్ర డిప్యూటీ ప్రధాన కార్యదర్శి రాజశేఖర్, సీహెచ్ వెంకటరమణ, కేంద్ర జాయింట్ సెక్రటరీ బెల్లం అశోక్, దాసరి శ్రీనివాస్, ఏరియా నాయకులు ఈశ్వర్, సారంగపాణి, మధుసూదన్, తోట రాజిరెడ్డి, శివ, తిరుపతి, వై.శ్రీనివాస్, చక్రపాణి, బబ్బెర మల్లేశ్, హైమద్, సాయి, తోట శ్రీనివాస్ పాల్గొన్నారు.

రెబ్బెన, సెప్టెంబర్ 25 : బెల్లంపల్లి ఏరియాలోని గోలేటి జీఎం కార్యాలయం వద్ద టీబీజీకేఎస్ ఆధ్వర్యంలో కార్మికులు ధర్నా నిర్వహించారు. బెల్లంపల్లి ఏరియా టీబీజీకేఎస్ యూనియన్ ఉపాధ్యక్షుడు మల్రాజు శ్రీనివాసరావు మాట్లాడుతూ సింగరేణికి లాభాలు తెచ్చి పెట్టిన కార్మికులకు అన్యాయం చేయడం దారుణమని, వారికి 33 శాతం వాటా చెల్లించాల్సిందేనని డిమాండ్ చేశారు. అనంతర ఏరియా జీఎం శ్రీనివాస్‌కు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో టీబీజీకేఎస్ నాయకులు ధరావత్ మంగీలాల్, మారిన వెంకటేశ్వర్లు, అలవేణి సంపత్, ఓరం కిరణ్, మాంతు సమ్మయ్య, బొంగు వెంకటేశ్, రమేశ్, బాబురావు, సత్యనారాయణ ఉన్నారు.



ఎస్‌వోటు జీఎంకు వినతిపత్రం అందజేస్తున్న టీబీజీకేఎస్ నాయకులు

# హడలెత్తిస్తున్న గ్యాంగ్ వార్స్!

## మంచిర్యాలలో అదుపు తప్పుతున్న గొడవలు

- అధికార పార్టీ నాయకుడి అండతోనే గంజాయి బ్యాచ్‌ల హల్‌చల్!
- గూండాయిజం, రౌడీయిజం ఉండనివ్వనన్న ఎమ్మెల్యే పీఎస్సార్
- ప్రకటన చేసిన రాత్రే కొట్టుకున్న రెండు వర్గాలు
- ఇద్దరికి తీవ్ర గాయాలు.. ఒకరి పరిస్థితి విషమం
- ఓ వర్గానికి అనుకూలంగా కేసు నమోదు చేశారనే ఆరోపణలు



ఈ నెల 17న 'మా విందు' హోటల్‌లో బీఆర్ఎస్వీ లీడర్‌పై దాడి చేస్తున్న ఓ బ్యాచ్

మంచిర్యాల, సెప్టెంబర్ 25 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : మంచిర్యాల జిల్లా కేంద్రంలో గ్యాంగ్‌వార్స్ హడలెత్తిస్తున్నాయి. ప్రశాంతంగా ఉన్న నగరంలో ఎప్పుడు ఏం జరుగుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు సోమవారం ప్రెస్‌మీట్ పెట్టి మరీ రౌడీయిజం, గూండాయిజాన్ని ఉండనివ్వబోమని ప్రకటన చేసిన రోజే అర్ధరాత్రే మంచిర్యాల బైపాస్ రోడ్డులో రెండు వర్గాల యువకులు కత్తులు, రాడ్‌లతో పరస్పర దాడులు చేసుకున్నారు. కాంగ్రెస్ పార్టీలో ఓ నాయకుడి దగ్గర పని చేసే వ్యక్తిపై దాడి చేసేందుకు వచ్చిన ఇద్దరి యువకులు, అక్కడే ఉన్న వాచ్‌మెన్‌తో పాటు సదరు వ్యక్తి కొట్టుకున్నారు. ఈ ఘటనలో నలుగురికి గాయాలయ్యాయని పోలీసులు చెబుతున్నారు. కాగా, దాడికి వచ్చిన ఇద్దరు యువకులకు తీవ్ర గాయాలయ్యాయని, ఇందులో ఒకరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తున్నది. ఈ నెల 17న వినాయక నిమజ్జనం రోజున అర్ధరాత్రి ఐబీ చౌరస్తాలోని 'మా విందు' హోటల్‌లో ఓ బీఆర్ఎస్వీ నాయకుడిపై దాడి జరిగింది. హోటల్‌లో మొదలైన గొడవలో అతన్ని కొట్టుకుంటూ బయటికి తీసుకువచ్చారు. అంతకు ముందు బీఆర్ఎస్ నాయకుడు రాకేశ్‌పైనా ఈ తరహాలోనే గ్యాంగ్ దాడి జరిగింది. కారు అద్దాలను ధ్వంసం చేసి హాకీ స్టిక్స్, క్రికెట్ వికెట్లతో ఓ వర్గం యువకులు విచక్షణా రహితంగా దాడి చేశారు. గతేడాది సైతం వినాయక నిమజ్జనం రోజున కూడా ఇదే తరహాలో దాడులు జరిగాయి. నిమజ్జనంలో మొదలైన గొడవ పరస్పర దాడులకు కారణమైంది. ఆ టైమ్‌లో గంజాయి బ్యాచ్ కారణంగానే గొడవ జరిగిందనే వార్తలు వచ్చాయి. ఇక అసెంబ్లీ ఎన్నికల సమయంలో బైపాస్ రోడ్‌లో ఏ ఇంటి దగ్గరైతే దాడి జరిగిందో.. నిన్న అక్కడే హాకీ స్టిక్స్‌తో రెండు వర్గాల యువకులు కొట్టుకున్నారు. ఇందుకు సంబంధించిన వీడియోలు బయటికి రావడంతో అప్పట్లో ఇది సంచలనం సృష్టించింది. ఇది జరిగిన కొన్ని రోజులకే స్థానిక హిందూబార్‌లో మద్యం సేవించిన యువకులు బయటికి వచ్చి గొడవకు దిగారు. అది గమనించిన మరో యువకుడు వారిని ఆపే ప్రయత్నం చేయగా, అందరూ కలిసి సదరు యువకుడిపై క్రికెట్‌బ్యాట్, వికెట్లతో దాడి చేశారు. తప్పించుకునే ప్రయత్నం చేసిన సదరు యువకుడిని రోడ్డుపై పరిగెత్తిచుకుంటూ మరీ దాడి చేశారు.



హిందూబార్ సమీపంలో ఓ యువకుడిపై వికెట్లు, క్రికెట్ బ్యాట్‌తో దాడి చేస్తున్న గ్యాంగ్ (ఫైల్)



సోమవారం రాత్రి జరిగిన దాడిలో గాయపడి చికిత్స పొందుతున్న యువకుడు

### గంజాయి బ్యాచ్‌లతోనే గొడవలు...?

ఈ గొడవలన్నింటికీ గంజాయి బ్యాచ్‌లే కారణమని తెలుస్తున్నది. మంచిర్యాల బైపాస్‌పాస్ రోడ్డు సహా గద్దెరాగడి, తదితర ఏరియాల్లో నాలుగు నుంచి ఐదు గంజాయి బ్యాచ్‌లు ఉన్నట్లు తెలిసింది. గంజాయి సేవించడానికి అలవాటు పడిన వారిని అధికార పార్టీకి చెందిన ఓ నాయకుడే ప్రోత్సహిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. బైపాస్ రోడ్డులో సోమవారం అర్ధరాత్రి గొడవ జరిగిన ప్రాంతంలోనే కొందరు యువకులు గంజాయి సేవిస్తుంటారని స్థానికులు చెబుతున్నారు. అటు వైపు వెళ్లిన వాహనదారులను సైతం అడ్డుకొని కొట్లాటకు దిగుతున్నారని, వారితో గొడవ ఎందుకని మరో మార్గం గుండా వెళ్లిపోయిన సందర్భాలున్నాయని రాళ్లపేటకు చెందిన ఓ రిటైర్డ్ ప్రభుత్వ ఉపాధ్యాయుడు చెప్పారు. మంచిర్యాల చుట్టూ ఉన్న ఈ గంజాయి బ్యాచ్‌లను కొందరు సెటిల్మెంట్‌ల కోసం వాడుకుంటున్నారు. రియల్టర్లు, వ్యాపారులను బెదిరించడం, డబ్బులు వసూలు చేయడమే వీరి పనిగా తెలుస్తున్నది. మొదట ఒకటే బ్యాచ్‌గా ఉన్న వీరంతా ఎవరికి వారు సెపరేట్ బ్యాచ్‌లుగా విడిపోయినట్లు తెలిసింది. దీంతో ఒకరికంటే ఒకరు గొప్ప అని నిరూపించుకునేందుకు కొంతకాలంగా పరస్పర దాడులకు దిగుతున్నట్లు పోలీసులు శాఖలో పని చేసే కొందరు అధికారులు చెబుతున్నారు. ఆ క్రమంలోనే సోమవారం రాత్రి గొడవ సైతం జరిగినట్లు తెలిసింది. రాత్రిళ్లు గంజాయి సేవించి రోడ్లపైకి వచ్చే ఈ బ్యాచ్‌లు వాహనదారులను బెదిరించి డబ్బులు వసూలు చేసిన ఘటనలు సైతం ఉన్నాయంటున్నారు. మరీ ఇంత దర్జాగా రాత్రి వేళల్లో గంజాయి సేవించి, ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తుంటే పోలీసులు ఏం చేస్తున్నారనేది అర్థం కావడం లేదు. నిత్యం పెట్రోలింగ్ నిర్వహించే పోలీసులకు ఈ విషయం తెలియదా అంటూ స్థానికులు ప్రశ్నిస్తున్నారు. కాగా, ఇటీవల మంచిర్యాలలో జరిగిన గ్యాంగ్ వార్‌లలో ఇదే బ్యాచ్ ఉన్నట్లు తెలుస్తున్నది. అధికారపార్టీకి చెందిన ఓ నాయకుడి అండ ఉండడం వల్లే పోలీసులు వారిని ఏం చేయలేకపోతున్నారనే విమర్శలు వస్తున్నాయి.

### గొడవపై క్లారిటీ ఇవ్వని పోలీసులు

సోమవారం రాత్రి జరిగిన గొడవపై మంగళవారం రాత్రి వరకు పోలీసులు క్లారిటీ ఇవ్వలేదు. బైపాస్ రోడ్డులోని ఆ ఇంటి ముందు ప్రత్యేక బలగాలను మోహరించి మరీ పహారా కాశారు. ఓ పోలీస్ వాహన సైతం మంగళవారం ఉదయం నుంచి రాత్రి వరకే అదే ఏరియాలో సైరన్ వేసుకొని తిరిగింది. దీంతో స్థానికులు బయపడిపోయారు. బైపాస్ రోడ్డులోని తెలంగాణ తల్లి విగ్రహం దగ్గర పోలీసులు ఉండగానే..ఆ ఇంటికి కొద్ది దూరంలో పాడుబడిన బావి సమీపంలో ఇరవై ముప్పై మంది గుమిగూడి కనిపించారు. కాసేపటికి ప్రత్యేక బలగాలు రావడంతో వారు అక్కడి నుంచి వెళ్లిపోయారు. కాగా, పాత కక్షల కారణంగా కాంగ్రెస్ లీడర్ దగ్గర పని చేసే ఓ వ్యక్తిపైకి దాడికి వచ్చారని పోలీసులు చెబుతున్నా.. సోమవారం ఉదయమే గొడవ జరిగిందని, దానికి ప్రతీకారణంగానే రాత్రి వారు దాడికి వచ్చారని తెలుస్తున్నది. అందుకే పోలీసులు చాలా సేపటి వరకు క్లారిటీ ఇవ్వలేదని, ఈ ఘటనలో ఓ వర్గానికి అనుకూలంగా కేసు నమోదు చేశారనే గుసగుసలు వినిపిస్తున్నాయి. దాడికి వచ్చిన ఇద్దరు యువకుల్లో ఒకరి తలకు తీవ్రగాయాలై కోమాలోకి వెళ్లిపోయినట్లు సమాచారం. ప్రస్తుతం కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న యువకుడి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. మరో యువకుడు తీవ్ర గాయాలపాలై వరంగల్ ఎంజీఎం దవాఖానలో ఉన్నారు. దాడికి గల కారణాలు, దాడిలో పాల్గొన్న వారు ఎందరు అనే వివరాలపై స్పష్టత లేదు. ఇప్పటికైనా పోలీసులు ఈ విషయంపై స్పష్టత ఇవ్వాలని పట్టణ వాసులు కోరుతున్నారు. దీనిపై మంచిర్యాల సీఐ బన్సీలాల్‌ను వివరణ కోరగా.. విచారణ నిర్వహిస్తున్నామని, త్వరలోనే వివరాలు వెల్లడిస్తామని చెప్పారు.

### రక్షణ కోరిన యువకుడి తల్లి..

దాడిలో గాయపడి కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న యువకుడి తల్లి సైతం పోలీసులను ఆశ్రయించింది. మంగళవారమే పోలీస్ స్టేషన్‌కు వెళ్లాలనుకున్నానని.. కానీ మా అబ్బాయి సీరియస్‌గా ఉన్నాడని తెలిసి కరీంనగర్ వెళ్లామని చెప్పింది. బైపాస్ రోడ్డులో బండిపై వెళ్తున్న తనపై దాడి జరిగిందని మాత్రమే మా అబ్బాయి చెప్పాడని.. అనంతరం కోమాలోకి వెళ్లిపోయాడని వాపోయింది. అసలేం జరిగిందో తెలుసుకునేలోగా కేసు నమోదైనట్లు ప్రకటన వచ్చిందని పేర్కొంది. తన కొడుకుపై దాడి నేపథ్యంలో తనకు రక్షణ కావాలని పోలీసులను ఆమె కోరినట్లు సమాచారం.

# ఇన్‌చార్జిలతో ఇంకెంతకాలం?

- జిల్లా విద్యాశాఖలో వెక్కిరిస్తున్న ఖాళీలు
- మంచిర్యాల డీఈవోకు ఆసిఫాబాద్ ఇన్‌చార్జిగా బాధ్యతలు
- 15 మండలాల్లోనూ ఇన్‌చార్జి ఎంఈవోలే
- పాఠశాలల్లో పర్యవేక్షణ లేక గాడితప్పుతున్న విద్య

కుమ్రం భీం ఆసిఫాబాద్, సెప్టెంబర్ 25 (నమస్తే తెలంగాణ) : జిల్లాలో విద్యాధికారితో పాటు అందరూ ఇన్‌చార్జి ఎంఈవోలే ఉండగా, పాఠశాలలపై పర్యవేక్షణ కరువై విద్యా వ్యవస్థ గాడితప్పుతున్నది. రెగ్యులర్ డీఈవో ఇటీవల బదిలీ కాగా, మంచిర్యాల డీఈవో యాదయ్యకు ఆసిఫాబాద్ జిల్లా ఇన్‌చార్జి డీఈవోగా బాధ్యతలు అప్పగించారు. ప్రతి మండలంలో సీనియర్ ప్రధానోపాధ్యాయులకే ఇన్‌చార్జి ఎంఈవోలుగా బాధ్యతలు అప్పగించారు. ఓ వైపు విధులు నిర్వహిస్తూనే.. మరోవైపు పాఠశాలల పర్యవేక్షణ.. తదితర పనులు చూడడం వారికి కష్టతరమవుతున్నది. ఒక్కో ఇన్‌చార్జికి మూడు, నాలుగు మండలాలుండడం వల్ల బాధ్యతలు నిర్వహించడం తలకుమించిన భారమవుతున్నది.




### గాడి తప్పుతున్న విద్యా వ్యవస్థ

నిత్యం ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలతో పాటు కేజీబీవీ, మోడల్ స్కూళ్లను పర్యవేక్షించాల్సి ఉండగా, పూర్తి స్థాయి అధికారులు లేకపోవడంతో ఆశించిన ఫలితాలు రావడం లేదు. పర్యవేక్షించే వారు.. పట్టించుకునేవారు లేకపోవడంతో కొందరు ఉపాధ్యాయులు విధులను సైతం నిర్లక్ష్యం చేస్తున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి. అనేక మంది సమయపాలన పాటించడం లేదని తెలుస్తున్నది. విద్యా సంవత్సరం ప్రారంభమై మూడు నెలలు గడుస్తున్నా రెగ్యులర్ ఎంఈవోలను నియమించకపోవడం దారుణమని, దీని ప్రభావం విద్యార్థుల భవిష్యత్‌పై పడుతుందని పలువురు విద్యావేత్తలు పేర్కొంటున్నారు.



సబ్ స్టేషన్‌లో వీసీబీని ప్రారంభిస్తున్న ఎస్ఈ శ్రావణ్‌కుమార్

# అంతరాయం లేని విద్యుత్ సరఫరాకు కృషి

**- ఎస్ఈ శ్రావణ్‌కుమార్**

మంచిర్యాలటౌన్, సెప్టెంబర్ 25 : వినియోగదారులకు అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరాను అందించేందుకు నిరంతరం కృషి చేస్తున్నామని విద్యుత్ శాఖ ఎస్ఈ ఎన్ శ్రావణ్‌కుమార్ అన్నారు. బుధవారం మంచిర్యాలలోని టౌన్-2 సెక్షన్ పరిధిలోని ఏసీసీ 33/11 కేవీ సబ్‌స్టేషన్‌లో రూ. 6 లక్షలతో ఏర్పాటు చేసిన వీసీబీ పరికరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ పరికరంతో గౌతమీనగర్, రాళ్లపేట ప్రాంతాల్లోని ఫీడర్‌లపై ఓవర్‌లోడ్ పడకుండా ఉంటుందని, మెరుగైన విద్యుత్ సరఫరా జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ డీఈ ఎంఎం ఖైజర్, ఏడీ వేణుగోపాల్, ఏఈ ఎస్ జాన్, లైన్‌ఇన్‌స్పెక్టర్ రవికుమార్ పాల్గొన్నారు.

# ప్రతిభ కనబర్చాలి

- సీపీ శ్రీనివాస్
- రామగుండంలో మొదటిసారి పోలీస్ డ్యూటీ మీట్



సిబ్బంది ప్రతిభను పరిశీలిస్తున్న రామగుండం సీపీ శ్రీనివాస్

మంచిర్యాల అర్బన్, సెప్టెంబర్ 25 : పోలీసు అధికారులు, సిబ్బంది ప్రతిభను కనబర్చుకోవడానికి పోలీస్ డ్యూటీ మీట్ మంచి వేదిక అని రామగుండం కమిషనర్ శ్రీనివాస్ అన్నారు. బుధవారం రామగుండం పోలీస్ కమిషనరేట్‌లో మంచిర్యాల, పెద్దపల్లి జోన్ పరిధిలోని పోలీస్ అధికారులు, సిబ్బందికి పోలీస్ డ్యూటీ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో మొట్టమొదటిసారిగా ఇక్కడ పోలీస్ డ్యూటీ మీట్ కార్యక్రమాన్ని ప్రారంభించామన్నారు. పలు అంశాలపై పరీక్షలు నిర్వహిస్తామని, ఇందులో ప్రతిభ కనబర్చిన వారు అక్టోబర్ 4న రామగుండం కమిషనరేట్‌లో నిర్వహించే కాళేశ్వరం జోన్ స్థాయి పోలీస్ డ్యూటీ మీట్‌కు ఎంపికవుతారన్నారు. పోలీస్ డ్యూటీ మీట్ నేరాలను శాస్త్రీయంగా గుర్తించి దర్యాప్తు చేయడం కోసం ఉపయోగపడుతుందన్నారు. జోన్ స్థాయిలో, రాష్ట్ర స్థాయిలో ప్రతిభ కనబరిచి కమిషనరేట్‌కు మంచి పేరు తీసుకరావాలన్నారు.


### జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

ఈ నెల 28న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని రామగుండం పోలీస్ కమిషనర్ ఎం.శ్రీనివాస్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. లోక్ అదాలత్ ద్వారా సత్వర న్యాయం జరుగుతుందని పేర్కొన్నారు. చిన్న చిన్న గొడవలతో కక్షలు పెంచుకొని కోర్టుల చుట్టూ తిరిగి సమయాన్ని, డబ్బులను వృథా చేసుకోవద్దని తెలిపారు.

### ఆసిఫాబాద్‌లో డ్యూటీమీట్

ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్, సెప్టెంబర్ 25 : జిల్లా కేంద్రంలోని పోలీసు కార్యాలయంలో కంప్యూటర్, ఫోరెన్సిక్ సైన్స్, ఫింగర్ ప్రింట్ హ్యాండ్లింగ్ లిఫ్టింగ్ ప్యాకింగ్, బాంబు డిస్పోజల్ స్క్వాడ్, పోలీస్ జాగిలాలు,ట్రాకింగ్ ఎక్స్‌క్లూసివ్ విభాగాల్లో సిబ్బందికి డ్యూటీ మీట్ నిర్వహించారు. వివిధ విభాగాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన సిబ్బందిని జోనల్ రాష్ట్రస్థాయి డ్యూటీ మీట్‌కు ఎంపిక చేయనున్నట్లు ఎస్పీ డీవీ శ్రీనివాసరావు తెలిపారు. రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి మెడల్స్‌తో పాటు నగదు, సాలరీల్లో ఇంక్రిమెంట్స్ ఇవ్వడం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు.

# ఓపెన్ పరీక్షలు సజావుగా నిర్వహించాలి



మాట్లాడుతున్న ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే

ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్, సెప్టెంబర్ 25 : అక్టోబర్ 3 నుంచి 9వ తేదీ వరకు ఓపెన్ ఎస్సెస్సీ, ఇంటర్ పరీక్షలను సజావుగా నిర్వహించాలని కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో ఆసిఫాబాద్ ఆర్డీవో లోకేశ్వర్‌రావుతో కలిసి పలు శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించే ఎస్సెస్సీ పరీక్షల కోసం జిల్లా కేంద్రంలోని జడ్పీ బాలికల ఉన్నత పాఠశాల, ఇంటర్ పరీక్షల కోసం జనకాపూర్‌లోని జడ్పీ ఉన్నత పాఠశాలలో పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పదో తరగతి పరీక్షలకు 165 మంది, ఇంటర్ పరీక్షలకు 110 మంది విద్యార్థులు హాజరుకానున్నారన్నారు. ఉదయం తొమ్మిది గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తారని, విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందుల్లేకుండా పూర్తిస్థాయిలో ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. పరీక్షల సమయానికి అనుగుణంగా ఆర్టీసీ బస్సులు నడిపించాలని, ప్రశ్నా పత్రాలను పోలీసు బందోబస్తు మధ్య తరలించాలని సూచించారు. పరీక్షా కేంద్రాల సమీపంలోని 144 సెక్షన్ అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి జిల్లా విద్యాధికారి ఉదయ్ బాబు, జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి తుకారాం, ఆసిఫాబాద్ టౌన్-1 సీఐ సతీశ్, అధికారులు పాల్గొన్నారు.


- జన్మదిన శుభాకాంక్షలు
- పొలిటికల్
- స్వదేశాగమనం
- లీగల్ ప్రకటనలు
- క్లాసిఫైడ్స్
- పదవీ విరమణ
- ప్రారంభోత్సవం
- శ్రద్ధాంజలి
- సినిమా
- వివాహ మహోత్సవం
- షష్టిపూర్తి మహోత్సవం మరియు
- అన్ని శుభకార్యాలు

నమస్తే తెలంగాణ
మన రాష్ట్రం.. మన పత్రిక...

నమస్తే తెలంగాణ దినపత్రికలో ప్రకటనల కోసం సంప్రదించండి..

ప్రకటనల విభాగం...

సెల్: 9182 777 571

మంచిర్యాల జిల్లా : 9182 777 676

కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా : 9182 777 679